సాక్షి విశాఖపట్నం

సోమవారం। 14। అక్టోబర్। 2024



కచ్చితమైన సమాచారం అందించి.. తుపాన్లు, వరదల ముంపు బారిన సాధారణ ప్రజలు, మత్స్యకారులు పడకుండా జాగ్రత్తలు చెబుతున్నామని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం ప్రధాన అధికారి భారతీ ఎస్ సబడే అన్నారు. మత్స్యకారులందరికీ మరింత ఉపయుక్తమయ్యేలా ఇకపై తెలుగులోనూ రోజువారీ హెచ్చరికలు జారీ చేస్తామని తెలిపారు. కైలాసగిరిపై ఏర్పాటు చేసిన డాప్లర్ రాడార్ ఆధునికీకరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. తుపాను హెచ్చరికల్లో అత్యాధునిక పద్ధతులకు శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో 'సాక్షి'తో ఆమె పలు విషయాల్ని పంచుకున్నారు.

-సాక్షి, విశాఖపట్నం

వెదర్ రిపోర్ట్ ఇక తెలుగులోనే..

- తుపాను సమాచారం అందరికీ అందుబాటులోకి తీసుకొస్తున్నాం
- విశాఖ రాడార్ ఆధునికీకరణ పనులు త్వరలో ప్రారంభం
- విశాఖకు 500 కిలోమీటర్ల పరిధిలో తుపాను సూచనల సమాచారం సేకరిస్తున్నాం
- దాదాపు కచ్చిత సమాచారం అందిస్తున్నాం
- తుపాను ప్రభావాల్లో విశాఖనగరం పీ2 రేంజ్‌లో ఉంది
- విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం చీఫ్ భారతి ఎస్ సబడే

సాక్షి ఇంటర్వ్యూ

రాడార్ ఆధునికీకరణ

ఒకప్పుడు డాల్ఫిన్ నోస్‌పై సైక్లోన్ డిటెక్షన్ రాడార్ ఉండేది. దాన్ని ఆధునికీకరిస్తూ కైలాసగిరిపై 2006లో డాప్లర్ వెదర్ రాడార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశాం. ఇది పూర్తిగా జర్మన్ టెక్నాలజీ అయిన జెమట్రోనిక్ ఎస్‌బ్యాండ్ డాప్లర్. దాదాపు 18 ఏళ్ల పాటు నిర్విరామంగా సేవలందిస్తోంది. హుద్‌హుద్ సమయంలో కీలకంగా వ్యవహరించింది. అయితే.. ఇటీవల మరమ్మతులకు గురైతే.. సరిచేశాం. దేశవ్యాప్తంగా పాత రాడార్లని ఆధునికీకరించేందుకు ఐఎండీ శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా.. కైలాసగిరిపై ఉన్న ఈ రాడార్ ఆధునికీకరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తాం.



కైలాసగిరిపై డాప్లర్ రాడార్

500 కిమీ పరిధిలో..

విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం నుంచి వాతావరణ సమాచారం అందిస్తున్నాం. కేవలం ఉత్తరాంధ్ర జిల్లాలకే కాకుండా ఒడిశాలోని కొన్ని భాగాలకు, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకూ ఇలా మొత్తం విశాఖ నుంచి 500 చ.కిమీ విస్తీర్ణం పరిధిలో ఉన్న స్టేక్ హోల్డర్‌లకు నిరంతరం వెదర్ అప్‌డేట్స్ అందిస్తున్నాం.

పీ2 పరిధిలో విశాఖ

ఏపీలో తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్ని ఐఎండీ గత అనుభవాల ప్రకారం గుర్తించింది. ఉమ్మడి జిల్లాల పరిధిలో చూస్తే.. మొత్తం 9 జిల్లాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అంటే తీరం దాటే అవకాశాలు ఈ పరిధిలోనే జరుగుతుంటాయి. తుపాను తీవ్రత, తీరందాటే అవకాశాలను రెండుగా విభజించారు. ఇందులో నెల్లూరు, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలు వెరీ హై ప్రోన్ (పీ1) జాబితాలో ఉండగా.. శ్రీకాకుళం, గుంటూరు, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, ప్రకాశం, విజయనగరం పీ2 పరిధిలో ఉన్నాయి.

త్వరలో తెలుగు బులెటిన్

ప్రతి రోజూ నిరంతర వాతావరణ సమాచారం, ఈదురుగాలుల ప్రభావం, తుపాను ప్రభావం, సముద్రం అల్లకల్లోలంగా ఉందా లేదా, వర్షం పడుతుందా లేదా..? మొదలైన కచ్చితమైన వాతావరణ సమాచారం అందిస్తున్నాం. అయితే ప్రస్తుతం ఇంగ్లిష్ భాషలో అందిస్తూ.. వివిధ మాధ్యమాల ద్వారా మత్స్యకారులకు చేరవేస్తున్నాం. ఇకపై ఐఎండీ సూచనలకు అనుగుణంగా ప్రాంతీయ భాష తెలుగులోనూ నిరంతర బులిటిన్స్ అందజేయనున్నాం. త్వరలోనే దీన్ని అందుబాటులోకి తీసుకొస్తాం.

రంగుల ఆధారంగా హెచ్చరికలు జారీ

తుపాను సమయంలోనూ అల్పపీడనాల సమయంలోనూ విడుదల చేసే బులిటిన్స్‌లో వాటి ప్రభావాన్ని సులువుగా మత్స్యకారులు, ఇతర స్టేక్ హోల్డర్లు గుర్తించేందుకు ప్రత్యేకంగా రూపొందిస్తాం. ఉదాహరణకు గాలుల వేగాన్ని సులువుగా తెలుసుకునేందుకు విభిన్న రంగుల్లో అందిస్తాం. ఉదాహరణకు గాలుల వేగం గంటకు 31 కిమీ కంటే తక్కువగా ఉన్నప్పుడు స్కై బ్లూ, 31–49 కిమీ అయితే లేత ఆకుపచ్చ, 49–61కిమీ అయితే ఆరెంజ్, 61–85 కిమీ అయితే ఊదారంగు, 85–117 కిమీ అయితే పసుపు రంగు, 117–166 కిమీ అయితే.. ముదురు ఎరుపు రంగు, 166–221 కిమీ అయితే నీలం రంగుతో మ్యాప్‌లలో సూచిస్తాం. వీటిపై మత్స్యకారులకు ఇప్పటికే అవగాహన కల్పించాం. దీనిద్వారా కూడా మత్స్యకారులు అప్రమత్తమవుతున్నారు. ప్రతిసారీ దాదాపు అన్ని వాతావరణ విషయాల్లోనూ విశాఖ సీడబ్ల్యూసీ నుంచి కచ్చితమైన సమాచారం అందిస్తున్నాం. భవిష్యత్తులో మరింత మెరుగుపడే దిశగా అడుగులు వేస్తున్నాం.



ఆర్కే బీచ్‌కు పోటెత్తిన పర్యాటకులు

సిటీ.. ఖుషీ

దసరా వేళ విశాఖ విభిన్నంగా దర్శనమిచ్చింది. పిల్లలకు సెలవు రావడంతో కుటుంబసమేతంగా కొందరు సొంతూళ్లకు పయనం కాగా.. వీకెండ్ కలిసిరావడంతో వేరేప్రాంతాల్లో స్థిరపడిన విశాఖవాసులు నగరానికి చేరుకున్నారు. ఒకవైపు నగరంలోని ప్రధాన రహదారులు బోసిపోగా.. సాగరతీరాలు మాత్రం ఇసుకేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిపోయాయి. పర్యాటక ప్రాంతాలన్నీ కళకళలాడాయి. ఆర్కే బీచ్‌కు వేలాది మంది తరలిరావడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆదివారం ఉదయం మాంసం విక్రయాలతో ప్రారంభమైన వేడుకలు.. మధ్యాహ్నం మద్యం షాపుల వద్ద కిక్ ఎక్కించాయి. సాయంత్రం సంద్రం చెంత సేదతీరుతూ, రాత్రి వరకు ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపి దసరా సంబరాలకు ముగింపు పలికారు. మొత్తానికి దసరాను సిటీజనులు ఖుషీఖుషీగా జరుపుకొన్నారు. -బీచ్‌రోడ్డు/ ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్లు, విశాఖపట్నం



ఆర్కే బీచ్ రోడ్డు కిటకిట



ఆశీల్‌మెట్ట జంక్షన్ ఇలా..



నిర్మానుష్యంగా తెలుగుతల్లి ఫ్లైఓవర్..



జోడుగుళ్ల పాలెం వద్ద రద్దీ



వైఎస్సార్ వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల తాకిడి

అమ్మలేం.. కొనలేం!



సబ్సిడీ టమాటాపై వ్యాపారులు, కొనుగోలుదారుల గగ్గోలు

- నాణ్యత లేని టమాటాలు సరఫరా చేయడమే కారణం
- క్రేటు టమాటాపై రవాణా భారం రూ.25 నుంచి రూ.30
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ.. వ్యాపారుల ఆవేదన

సీతమ్మధార : ప్రభుత్వం సరఫరా చేస్తున్న సబ్సిడీ టమాటా ఇటు వ్యాపారులకు, అటు కొనుగోలుదారులకు సరదా తీర్చేస్తోంది. టమాటా ధరలు పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం నగరంలోని అన్ని రైతుబజార్లలో ఈ నెల 8 నుంచి కిలో రూ.50 చొప్పున సబ్సిడీ టమాటా విక్రయాలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం అన్ని బజార్లు కలిపి 1,323 క్రేట్లతో 21,620 కిలోల టమాటా సరఫరా చేశారు. ఈ టమాటా నాణ్యత అధ్వానంగా ఉండటంతో వినియోగదారుల నుంచి వ్యాపారులు చీవాట్లు తినాల్సి వచ్చింది.

డ్వాక్రా సంఘాల గగ్గోలు

మర్రిపాలెంలోని ప్రభుత్వ గొడౌన్ నుంచి రైతుబజార్లకు టమాటా సరఫరా అవుతుంది. రవాణా చార్జీలు డ్వాక్రా వ్యాపారులే భరించాలి. సీతమ్మధార రైతుబజార్‌కు క్రేటుకు రూ.25, కొమ్మాది, ఎంవీపీ బజార్లకు రూ.30 చొప్పున చెల్లించాలి. ప్రతి క్రేటులోనూ రెండు కిలోల వరకు తరుగుతోపాటు, దెబ్బ తిన్న, కుళ్లిన పండ్లు ఉంటున్నాయి. వినియోగదారులు చిదిగిపోయిన, కుళ్లిన టమాటా తీసుకోవట్లేదు. దీంతో తామే నష్టపోవాల్సి వస్తోందని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. నగరంలోని ఓ రైతుబజారుకు 3,460 కిలోల టమాటా వస్తే 195 కిలోల వరకు పగిలిన టమాటా ఉంది. దాదాపు అన్ని రైతు బజార్లదీ ఇదే దుస్థితి. ఒకవైపు కమిషన్ ఇవ్వకుండా, మరోవైపు పాడైన టమాటా భారం కూడా తమపైనే వేస్తే ఎలా బతకాలని వారు ప్రశ్నిస్తున్నారు. నాణ్యతలేని టమాటా రావడంతో వినియోగదారులకు సమాధానాలు చెప్పలేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్‌శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

ధర తగ్గినా.. ప్చ్..!

రైతుబజార్లలో శనివారం నుంచి టమాటా కిలో రూ.48 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. లాభం, నష్టం లేని ప్రాతిపదికన ప్రభుత్వం టమాటా విక్రయాలు చేస్తోంది. వినియోగదారులకు ఆధార్‌కార్డు లేదా రైస్‌కార్డు ఆధారంగా కిలో లెక్కన తొలుత అందించేవారు. తర్వాత రెండు కిలోలకు పెంచారు. ఇప్పుడు కార్డులతో సంబంధం లేకుండా విక్రయాలు చేస్తున్నారు. దీనికంతటికీ టమాటాల్లో నాణ్యత లేకపోవడమే కారణంగా తెలుస్తోంది. ఈ మాత్రం దానికి క్యూల్లో నిరీక్షించి, వీటిని కొనుగోలు చేసి, వాటిలో పుచ్చులు, పగిలిన, కుళ్లిన వాటిని చూసి బాధపడటం ఎందుకని చాలా మంది బహిరంగ దుకాణాలనే ఆశ్రయిస్తున్నారు. అక్కడ రూ.10–20 ఎక్కువైనా ఇష్టమైన వాటిని ఎంచుకుని మరీ కొనుగోలు చేసుకోవచ్చంటున్నారు.

రైతుబజార్ల వారీగా టమాటా సరఫరా

రైతు బజార్	సరఫరా (కిలోల్లో)	రైతు బజార్	సరఫరా (కిలోల్లో)
సీతమ్మధార	3432	పెందుర్తి	2288
ఎంవీపీ కాలనీ	3513	కొమ్మాది	1634
నరసింహనగర్	1307	మర్రిపాలెం	1111
గోపాలపట్నం	2615	పెదవాల్తేరు	817
కంచరపాలెం	2451	గాజువాక	817
		పెదగంట్యాడ	490
		ఉక్కునగరం	654
		ములగాడ	490

నేటి నుంచి 'పల్లెపండగ'

మహారాణిపేట: జిల్లాలో సోమవారం నుంచి 20వ తేదీ వరకు 'పల్లె పండగ' పంచాయతీ వారోత్సవాలను నిర్వహించనున్నారు. కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 23న జిల్లాలో 79 గ్రామసభల్లో తీర్మానం చేసిన వాటి ప్రకారం పనులకు ప్రతిపాదనలు చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులను ఈ పనులను ప్రారంభిస్తారని జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి తెలిపారు. మొత్తం 79 పంచాయతీల్లో రూ.29.04 కోట్ల అంచనా వ్యయంతో గ్రామీణ మండలాల పరిధిలో 322 పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

లేబర్ బడ్జెట్ కూడా రూపొందించగా, దాని ప్రకారం పనులు చేపట్టనున్నారు. గ్రామ సభల్లో గుర్తించిన పనులను నోటిపై చేశారు. షెడ్యూల్ ప్రకారం సంక్రాంతి నాటికి అన్ని పనులను పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. పనుల నిర్వహణకు సంబంధించి అవసరమైన మడిసరుకు, పరికరాలను సమకూర్చుకుంటున్నామని వివరించారు.

నేడే లాటరీ

- విశాఖలో 155 మద్యం దుకాణాలకు 4,139 దరఖాస్తులు
- వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఉదయం 8 నుంచి లాటరీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

విశాఖ సిటీ: ప్రైవేటు మద్యం దుకాణాలకు సమయం ఆసన్నమైంది. లాటరీ ద్వారా వైన్‌షాపుల కేటాయింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటలకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ప్రారంభం కానుంది. సాయంత్రం 5 గంటలులోగా లాటరీ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 155 వైన్‌షాపులకు కలెక్టర్ హరేందిర ప్రసాద్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 10 రోజుల్లో 4,139 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారం రోజులకు ముందు ఒక్కో దుకాణానికి రెండు, మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అయితే చివరి మూడు రోజులు మాత్రం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. దీంతో ఒక్కో షాపునకు 27 మంది పోటీ పడుతున్నారు.

పక్కా ఏర్పాట్లు

పెద్ద సంఖ్యలో ఆశావహులు, వారి అనుచరులు ఈ లాటరీ కార్యక్రమానికి వచ్చే అవకాశాలు ఉండడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దరఖాస్తులు చేసిన వారు తప్పనిసరిగా ఉదయం 7.30 గంటలకు గురజాడ కళాక్షేత్రానికి చేరుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి సూచించారు. షాపు గెజిట్ నంబర్ల ప్రకారం ముందుగా అయిదు షాపులకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్న వారిని గురజాడ కళాక్షేత్రం నుంచి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలోకి అనుమతిస్తారు. లాటరీలో వైన్‌షాప్ దక్కించుకున్న వారు మొత్తం లైసెన్స్ ఫీజులో 1/6 రుసుమును వెంటనే చెల్లించేందుకు వీలుగా అక్కడ బ్యాంకింగ్ సేవలు కూడా అందుబాటులో ఉంచుతున్నారు. లేనిపక్షంలో ఆ తరువాత కూడా చెల్లించే వెసులుబాటు కల్పిస్తున్నారు. లాటరీలో షాపులు దక్కించుకున్న వారు ఈ నెల 16వ తేదీ నుంచి వ్యాపారం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఎక్సైజ్ అధికారులు ప్రొవిజన్ సర్టిఫికెట్లు సైతం వెంటనే అందించనున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

మద్యం లాటరీ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పక్కాగా చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు.

అప్పన్న సన్నిధిలో సినీ నటుడు సాయికుమార్



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం సినీ నటుడు సాయికుమార్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని అధికారులు అందజేశారు.



లాసన్స్ బే కాలనీలో



జగ్గారావు బ్రిడ్జి వద్ద



దొండపర్తి జంక్షన్‌లో పొంగి ప్రవహిస్తున్న మురుగు

చెత్త చెదారం

నగరం వ్యర్థాలతో దర్శనమిస్తోంది. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. పారిశుధ్య కార్మికులు శుక్రవారం నగరాన్ని శుభ్రం చేశారు. శనివారం దసరా కారణంగా వ్యర్థాలు తొలగించలేదు. ఆదివారం కూడా అదే పరిస్థితి. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు దర్శనమిచ్చాయి. పేరుకుపోయిన చెత్తే కళ్ల ముందు దర్శనమిస్తుండటంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల కాలువలు పొంగి ప్రవహించాయి. దీంతో దుర్గంధంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



పిఠాపురం కాలనీలో



పూర్ణామార్కెట్లో



అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డు వద్ద..

రేపటి నుంచి ఎస్జీఎఫ్ ఉమ్మడి విశాఖ క్రీడా పోటీలు

- ఎంపికైన క్రీడాకారులు, జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా పోటీలు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఆదివారం మీడియాకు తెలిపారు. ఈ నెల 15న అండర్-14 బాలురు, బాలికల క్రికెట్ పోటీలు అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో, అదేరోజు అండర్-14, 17(బాలురు, బాలికల) విభాగంలో ఫెన్సింగ్, బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు గోవాడ జెడ్పీ హైస్కూల్లో జరపనున్నట్లు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్జీఎఫ్ కార్యదర్శులు వి.దేముడు, ఎం.వి.నాగేశ్వరరావు, వి.కొండబాబు తెలిపారు.

- 16న బ్యాడ్మింటన్ ఎంపికలు అండర్ 14, 17 విభాగాల్లో ఇండోర్ స్టేడియం గోపాలపట్నంలోను, కబడ్డీ అండర్ 14 ఎంపికలు జెడ్పీ హైస్కూల్ వేములపూడి, అండర్ 14, 17 ఆర్చరీ పోటీలు అరకు స్పోర్ట్స్ స్కూల్, ఫుట్‌బాల్ అండర్ 14, తాక్రా అండర్-14, 17 ఎంపిక పోటీలు దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుపనున్నారు.
- 17న బాస్కెట్ బాల్ అండర్ 14, 17 పోటీలు ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సీతమ్మధార, హాకీ అండర్ 14 పోటీలు జెడ్పీ హైస్కూల్ నక్కపల్లి, అండర్ 14 ఖోఖో పోటీలు జెడ్పీ హైస్కూల్ అచ్యుతాపురంలో నిర్వహించనున్నారు.
- 18న కబడ్డీ అండర్ 17 పోటీలు జెడ్పీ హైస్కూల్ కూండ్రం, క్రికెట్ అండర్ 17 పీఎంపాలెంలోని వీడీసీఏ మైదానంలో నిర్వహించనున్నారు.
- 19న ఖోఖో అండర్ 17 పోటీలను జెడ్పీ హైస్కూల్ తుమ్మపాల, అండర్ 14, 17 చెస్ పోటీలు అనకాపల్లి జీవీఎంసీ మెయిన్ స్కూల్ సారథ్యంలో ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలో, హాకీ అండర్ 17 పోటీలు విశాఖలోని ఏయూ మైదానంలో, అండర్ 14, 17 లాన్ టెన్నిస్ పోటీలు విశాఖలో జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.
- 20న అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్, అండర్ 14,17 పవర్ లిఫ్టింగ్ పోటీలు జెడ్పీ హైస్కూల్ చెట్టిపల్లిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు గమనించి విద్యార్థులు, అర్హత పత్రాలతో హాజరు కావాల్సిందిగా కోరారు.

వైభవంగా అప్పన్న జమ్మివేట ఉత్సవం

- రామాలంకారంలో దర్శనమిచ్చిన అప్పన్న
- శాస్త్రోక్తంగా శమీపూజ


పూలతోటలోని మండపంలో స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


శమీపూజ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఈవో త్రినాథరావు

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జమ్మివేట ఉత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రాముడిగా అలంకరించి సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండ దిగువకి తీసుకొచ్చారు. కొండ దిగువ తొలిపావంచా వద్ద దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, అధికారులు, అడవివరం గ్రామస్తులు స్వామికి స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి స్వామి వారిని పూలతోటలోకి విహారానికి తీసుకెళ్లారు. పూలతోటలో ఉన్న ప్రధాన మండపంలో అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడషోపచార పూజలు, వేద పారాయణాలు, పంచశూక్త పారాయణాలను నిర్వహించారు. పూలతోటలో శమీ వృక్షం చెంత విశేష పూజలు జరిపారు. శమీ దళాలను కోసి స్వామికి సమర్పించారు. విశేషంగా అర్చన చేశారు. అనంతరం స్వామిని అశ్వవాహనంపై కొలువు దీర్చి, అడవివరం పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామి వారికి గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. అర్ధరాత్రి దాటిన తర్వాత మళ్లీ కొండపైకి స్వామిని తీసుకెళ్లారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు నరసింహాచార్యులు తదితరులు ఉత్సవాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, పూర్వ ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు.

సిరులతల్లి సన్నిధిలో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు


స్వర్ణ కవచాలంకరణ, 108 బంగారు పుష్పాల పూజలో సిరులతల్లి కనకమహాలక్ష్మి


పూజలో పాల్గొన్న సుంకర రామ రవీంద్ర, శ్రీరామ వెంకట నరసింహం తదితరులు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో గల కనకమహాలక్ష్మి దేవస్థానంలో పది రోజులుగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా విజయదశమి రోజున కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణ కవచ ధారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. 108 బంగారు పుష్పాలతో పూజ చేసి, పలు రకాల ఫలాలు సమర్పించారు. నగరానికి చెందిన సుంకర రామ రవీంద్ర, శ్రీరామ వెంకట నరసింహం రూ.55 వేలు చొప్పున విరాళంగా చెల్లించి స్వర్ణపుష్పార్చన, ఫలముల పూజలో పాల్గొన్నారు. అమ్మవారి అలంకరణకు పట్టు చీరలను లక్కీ షాపింగ్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ అధినేతలు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దర్శించుకున్న ప్రముఖులు

యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ, అనకాపల్లి జాయింట్ కలెక్టర్ జాహ్నవి పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మరణం తీరని లోటు

- నేడు భారత నాస్తిక సమాజం నివాళి

మహారాణిపేట: ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా మరణం అణగారిన ప్రజానీకానికి, సామాజిక ఉద్యమాలకు తీరని లోటని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి.శ్రీరామ్మూర్తి, జె.రవి ఆదివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. దాదాపు 90 శాతం అంగవైకల్యం ఉన్నప్పటికీ అణగారిన, ఆదివాసీ ప్రజల హక్కుల కోసం తన జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి సాయిబాబా అని కొనియాడారు. ఏ నేరం చేయకుండానే తొమ్మిదేళ్లు కారాగార శిక్ష అనుభవించిన ఉద్యమ నాయకుడని పేర్కొన్నారు. రాజ్యహింసకు వ్యతిరేకంగా, ప్రజలకు పరిపాలనా సౌలభ్యం చేరువ కావాలని, ఆదివాసీల ఆధీనంలోని భూమిలో ఉన్న ఖనిజ సంపద కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే కేంద్ర ప్రభుత్వ పన్నాగాలను బయట పెట్టినందుకే ఆయన్ని జైలు పాలు చేశారని ఆరోపించారు. చివరికి కోర్టు నిర్దోషిగా విడుదల చేసినా, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ కడదాకా పోరాడిన వ్యక్తి సాయిబాబా అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పౌర ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు.

మా ఊరిలో వైన్ షాపు వద్దు!


మధురవాడ వికలాంగుల కాలనీలో ధర్నా చేస్తున్న కాలనీ వాసులు


వైన్ షాపు వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

- మధురవాడ వికలాంగుల కాలనీలో స్థానికుల ఆందోళన

మధురవాడ: కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలకు విచ్చలవిడిగా అనుమతులిచ్చేయడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జీవీఎంసీ 8వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ సమీపంలోని వికలాంగుల కాలనీలో వైన్ షాపు ఏర్పాటు పట్ల స్థానికులు ఆదివారం ఆందోళనకు దిగారు. నివాసాల మధ్యలో, నివాస గృహంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సిద్ధం కావడంతో ఆదివారం కాలనీవాసులతోపాటు, పరిసర ప్రాంతాల ప్రజలు ధర్నా నిర్వహించారు. కాలనీకి వెళ్లే ప్రధాన మార్గం, స్కూల్ బస్సులు ఆగే స్థలం వద్ద వైన్ షాపు పెట్టొద్దంటూ నిరసన తెలిపారు. మా ఊరికి వైన్ షాపు వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాలనీ ప్రజలు, విద్యార్థులు, మహిళలకు రక్షణ కరువవుతుందని, యువత చెడు మార్గం పట్టే అవకాశం ఉందని ఆక్షేపించారు. తక్షణమే వైన్ షాపు ఏర్పాటు ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కాలనీ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదివారం జూ ఆదాయం రూ 5.76 లక్షలు


ఎలుగుబంటి ఎన్‌క్లోజరు వద్ద సందర్శకులు..


జూలో సందర్శకుల తాకిడి

ఆరిలోవ: దసరా సందర్భంగా నగరంలో పలు పార్కులు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. ఇందులో భాగంగా జూ పార్కును అధిక సంఖ్యలో సందర్శించారు. వారి ద్వారా రూ.లక్షల్లో ఆదాయం లభించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దలు, పిల్లలు జూని సందర్శించి వన్యప్రాణులను తిలకరించారు. పెద్ద పులులు, ఏనుగులు, పక్షులు, ఎలుగుబంట్లు, నీటి ఏనుగులు, కోతులు, జిరాఫీలు, జింకలు సందర్శకులను అలరించాయి. ఆదివారం జూ పార్కును 7,084 మంది సందర్శించారు. వారిలో 5,460 మంది పెద్దలు కాగా, 1,624 మంది పిల్లలున్నారు. వారి ద్వారా రూ.5,76,762 ఆదాయం లభించినట్లు ఇన్‌చార్జి క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

డిసెంబర్ 1న భీమిలి ఉత్సవ్

భీమునిపట్నం: భీమిలి ఉత్సవాలను డిసెంబర్ 1న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. భీమిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన కోలాటం పోటీలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భీమిలి ఉత్సవాలు ఎంతో ఘనంగా జరిగేవని, ఈ ప్రాంత చరిత్ర, గొప్పతనం అందరికీ తెలిసేదన్నారు. మళ్లీ ఇప్పుడు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో కళాకారులకు అవకాశం కల్పించి వారి ప్రతిభను ప్రదర్శించే వేదికగా ఈ ఉత్సవాలను జరిపించనున్నట్లు పేర్కొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి వెళ్తూ ప్రమాదం

- ఒకరి మృతి, ఏడుగురికి గాయాలు
- ఆగివున్న బస్సును ఢీకొన్న వ్యాన్


పోలారపు అప్పలనర్సమ్మ(ఫైల్)

పరవాడ: విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భవానీ భక్తులతో వెళ్తున్న బస్సును వెనుక నుంచి వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, ఏడుగురు గాయపడ్డారు. కొవ్వూరు పట్టణంలో శనివారం తెల్లవారు జామున జరిగిన ఈ దుర్ఘటన వివరాలివి. కలపాక గ్రామానికి చెందిన భవానీ మాలధారులు 27 మంది దీక్షను విరమించేందుకు ఈ నెల 11న రాత్రి 8.30 గంటలకు ఓ ప్రైవేట్ బస్సులో విజయవాడ దుర్గమ్మ గుడికి బయలుదేరారు. శనివారం తెల్లవారు జామున 2.30 గంటలకు బస్సును కొవ్వూరు వంతెన సర్వీస్ రోడ్డు ఎంట్రన్స్‌లో నిలిపి డ్రైవర్ టైర్లను పరిశీలిస్తుండగా, ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన వ్యాను బలంగా ఢీ కొంది. దీంతో బస్సులో వెనుక సీటులో కూర్చున్న అనకాపల్లి జిల్లా పరవాడ మండలం కలపాక గ్రామానికి చెందిన పోలారపు అప్పలనర్సమ్మ(50) మృతి చెందగా, ఇంటర్ చదువుతున్న ఆమె మనుమరాలు గ్రీష్మ(16) తీవ్రంగా, కోడలు పోలారపు సునీత, కురం రోజా(నాగలక్ష్మి), భార్గవి, ఇందల చిన్నమ్మలు, ఇందల రామునాయుడు, వనుం కిషోర్‌లు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి, డిశ్చార్జి చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గ్రీష్మను మెరుగైన వైద్యం కోసం నగరంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చేర్చారు. మృతురాలు అప్పలనర్సమ్మకు స్వగ్రామం కలపాకలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలు అప్పలనర్సమ్మకు భర్త, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అప్పలమనుమరాలు, కోడలికి గాయాలతో కలపాకలో విషాదఛాయలు అలముకున్నాయి.

నీలి నింగిలో.. వెండి మబ్బులు


ఆకాశాన మేఘ మాలికలు.. చూసే హృదయానికి కళ్లుండాలే గానీ.. ప్రతి విరుపూ ఓ మధురమైన చిత్తరువే. దసరా పండగ వేళ.. నగరంలో వాహనాల కాలుష్యం తగ్గిందేమో.. నీలి ఆకాశం కాన్వాస్‌గా చేసుకుని వెండి మబ్బుల వన్నెలద్దుకుంది. ఆదివారం నగరంలోని హనుమంతవాక -వేపగుంట, ఎన్ఏడీ-పెందుర్తి బీఆర్టీఎస్ రహదారిలో ఈ వెండి మబ్బులు ఆకాశహర్మ్యాలుగా కదలాడాయి. సుజాతనగర్ నివాస ప్రాంతాల వెనుక పచ్చని కొండలపై నురగ ముద్దలుగా ఏర్పడి చూపరులకు ఆనందాన్నిచ్చాయి. - మురళీనగర్

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెంలో బురద సత్తిబాబు(30) అనే యువకుడు శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు. పరదేశిపాలేనికి చెందిన అమ్మ తల్లికి ముగ్గురు సంతానం. కుమార్తె, పెద్ద కుమారుడు బొబ్బిలిలో వారి కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. చిన్న కుమారుడు సత్తిబాబు ఏపీ ఫైబర్‌లో పనిచేస్తున్నాడు. శనివారం 12 గంటలకు దసరా పూజ పూర్తి చేసుకుని విశ్రాంతి కోసం తన పడక గదిలోకి వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటలవుతున్నా భోజనానికి రాకపోవడంతో పెద్ద కొడుకు పిలిచాడు. అయినా సమాధానం లేదు. తలుపు కొట్టినా ప్రయోజనం లేకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలోనుంచి చూశాడు. సత్తిబాబు ఇనుప రాడ్డుకు చీరతో ఉరి వేసుకుని ఉన్నట్టు గమనించి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి కిందకి దింపారు. అప్పటికే సత్తిబాబు మరణించాడు. తర్వాత అతని మొబైల్ పరిశీలించగా కొన్ని అనుమానకర సందేశాలు, వాయిస్ రికార్డులు ఉన్నట్లు గమనించారు. దీంతో మృతుడి తల్లి అమ్మతల్లి పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని న్యాయవాది దుర్మరణం


ఉలిమిరి రామశాస్త్రి(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం బస్ స్టాప్ వద్ద ద్విచక్రవాహనం ఢీ కొని న్యాయవాది మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి గాజువాక సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. నాతయ్యపాలెంలో నివాసం ఉంటున్న న్యాయవాది ఉలిమిరి రామశాస్త్రి (55) శనివారం రాత్రి భోజనం చేసి నాతయ్యపాలెం బస్ స్టాప్ వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవిని దర్శించుకోవడానికి వచ్చారు. అమ్మవారిని చూసి మండపం నుంచి తిరిగి ఆయన ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చాడు. ఈ సమయంలో గాజువాక నుంచి షీలానగర్ వైపు ద్విచక్రవాహంపై వెళ్తున్న వ్యక్తి రామశాస్త్రిని ఢీ కొట్టాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయం అయ్యింది. వెంటనే అక్కడ ఉన్న వారు 108కు సమాచారం అందించారు. సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్టు నిర్ధారించారు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా దిచక్ర వాహనం నడుపుతున్న మధురవాడకు చెందిన వ్యక్తి పడిపోవడంతో గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు రామశాస్త్రికి భార్య సంధ్య, వివాహమైన కుమార్తె సాయి కుమారి, కుమారుడు అరుణ్ కుమార్ ఉన్నారు.

చికిత్స పొందుతూ ఖైదీ మృతి


బీచ్‌రోడ్డు: అనారోగ్యం కారణంగా టీబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖైదీ శనివారం మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు. విశాఖ సెంట్రల్ జైల్‌లో ఖైదీగా ఉన్న లచ్చన్న(58) గత నెల 27న అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం టీబీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న లచ్చన్న ఆరోగ్యం మరింతగా క్షీణించి, శనివారం మృతిచెందినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా ప్రధాన నిందితుడి అరెస్టు

సీతమ్మధార: ఐదేళ్లుగా వివిధ రాష్ట్రాల్లో పలుర కాల దొంగతనాలు చేస్తూ, తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర ముఠా ప్రధాన నిందితుడిని అరెస్టు చేసి జైలుకి పంపించినట్లు ద్వారకా సబ్ డివిజన్ క్రైం సీఐ బంగారుపాప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, విశాఖపట్నం తదితర నగరాల్లో పగటిపూట దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్న ఈ ముఠా ప్రధాన నిందితుడు అర్మార్‌ఖాన్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. సదరు ముఠా గతంలో ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేసిన చోరీ దర్యాప్తులో భాగంగా తన ఆధ్వర్యంలో ఏఎస్ఐ డి.కిశోర్‌బాబు, కానిస్టేబుళ్లు లోవరాజు, అప్పలరాజు, అగస్టీన్, నమదుద్దీన్ బృందం విచారణ ప్రారంభించిందన్నారు. తమకు దొరికిన ఆధారాల మేరకు ఢిల్లీలో విస్తృతంగా గాలించి, నిందితుడిని చాకచక్యంగా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేయంలో ప్రతిభ చూపిన అధికారులను, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.

ఇస్కాన్‌లో రావణ వధ


రావణ దహనం జరుగుతున్న దృశ్యం


హాజరైన అశేష భక్తజనం

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్‌లో దసరా వేడుకలు అత్యంత వైభవంగా ముగిశాయి. ముందుగా ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణులు, జగన్నాథ, సుభద్ర బలభద్రులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి రామ కళామృతం, రామ గానామృతం అనంతరం సాయంత్రం రావణ దహనం చేశారు. 50 అడుగుల రావణుడి బొమ్మను ఏర్పాటు చేసి దహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఫైర్ క్రాకర్ షో, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, రామలీలలపై ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఇస్కాన్ అధ్యక్షులు సాంబా దాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో మహాన్నదానం జరిపారు.

నిరాటంకంగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు


కూచిపూడి నృత్య కళాకారులకు బహుమతులు అందిస్తున్న అతిథులు, నిర్వాహకులు

మద్దిలపాలెం: నాట్యాచార్యుడు వెంపటి చిన సత్యం జయంతిని పురస్కరించుకుని స్థానిక కళాభారతి ఆడిటోరియంలో విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, కూచిపూడి కళాక్షేత్ర సంయుక్తంగా ఆదివారం నృత్యోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి నరవ ప్రకాష్‌రావు, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ హరి రామమూర్తి, డాక్టర్ పసుమర్తి వెంకటరమణ, డాక్టర్ సందీప్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ నాట్య సంస్థల నుంచి వచ్చిన నాట్య కళాకారులు ఉదయం 9 నుంచి రాత్రి 9.30 గంటల వరకు నిరాటంకంగా కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చారు. సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత వీసీ ఆచార్య బాల మోహన్ దాస్, కూచిపూడి కళాక్షేత్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్ బిత్రా, విశాఖ మ్యూజిక్ అకాడమీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.శ్రీనివాస్ తదితరులు నాట్య కళాకారులకు అవార్డులు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణారావు, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ హరి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.